సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 31 । మార్చి । 2024



ఉత్సాహంగా ఎంపికలు

జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా కేంద్రంలో ఎంపికలు నిర్వహించారు.

- IIలో



ఇంటిలో చోరీ

చాపర గ్రామంలోని ఓ ఇంటిలో చోరీ జరిగింది. బంగారు ఆభరణాలు దొంగిలించారు.

- IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది	సోమ
సాయంత్రం	ఉదయం
6.11	4.34

న్యూస్‌రీల్

ఎలుగు దాడి బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేత



మృతుల కుటుంబాలకు చెక్కులను అందజేస్తున్న అటవీశాఖాధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఎలుగు దాడి మృతుల కుటుంబాలకు అటవీ శాఖాధికారులు శనివారం ఎక్స్‌గ్రేషియా అందజేశారు. మండలంలో గల చీపురపల్లి పంచాయతీ పరిధిలో గల అనకాపల్లి గ్రామానికి చెందిన ఇటీవల జరిగిన ఎలుగు దాడి సంఘటనలో అప్పికొండ కుర్మారావు, చిడిపల్లి లోకనాథం మృతి చెందారు. మృతుల కుటుంబాలకు రూ. 2.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. మరో రూ.2.50 లక్షలు త్వరలోనే అందిస్తామని అన్నారు. చెక్కు అందజేసిన వారిలో కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజర్ మురళీకృష్ణ నాయుడు, అటవీ శాఖ అధికారులు ఎం.పోలయ్య, జోగారావు, ఎ.బాబూరావు, సర్పంచ్ ప్రతినిధి దాసరి పాపారావు, గ్రామ పెద్దలు కర్రి తిరుపతి తదితరులు ఉన్నారు.

'బీజేపీకి ఎలా సీటిస్తారు..?'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎచ్చెర్ల టీడీపీ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత మొదటిసారిగా ఎచ్చెర్లలో సైకిల్ గుర్తు పోటీలో లేకుండా ఎన్నికలు జరుగుతున్నాయని టీడీపీ నాలుగు మండలాల నాయకులు అన్నారు. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల నుంచి మండల స్థాయి నాయకులు ముప్పిడి సురేష్, గొర్లె విజయ్, డీసీ ఎం.అనందరావు, అంక శ్యామ్, పిన్నింటి మధుబాబు, రాజాపంతుల ప్రకాశరావు, సంధ్య తదితరులు శనివారం సమావేశం నిర్వహించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమకు ఏదైనా సమస్య వస్తే బీజేపీ నాయకుల వద్దకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. కనీసం తమను సంప్రదించకుండా సీటు ఎలా ఇస్తారని నిలదీశారు. గ్రామాల్లో బీజేపీ గుర్తు కూడా ఎవరికీ తెలియదన్నారు. నియోజక వర్గ స్థాయిలో పూర్తిస్థాయి కేడర్ ఉన్న పార్టీని కాదని, బీజేపీకి ఎలా సీటు కేటాయించారో అర్థం కావడం లేదన్నారు.

'పీఓ, ఏపీఓలు జాగ్రత్తగా ఉండాలి'

నరసన్నపేట: ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులంతా బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో శనివారం పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఆర్‌ఓ రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు విధిగా పాటించాలని కోరారు. పోలింగ్ రోజున పీఓ, ఏపీఓలు బాధ్యతగా ఉండాలన్నారు. మాక్ పోలింగ్ 90 నిమిషాల ముందు చేపట్టాలని అన్నారు. ఈవీఎంల పనితీరును గమనించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నరసన్నపేట ఆర్‌ఓ రామ్మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గ మాస్టర్ ట్రైనీల నుంచి పూర్తి సమాచారం తెలుసుకోవాలని కోరారు.

ఎండలతో జాగ్రత్త: కలెక్టర్

శ్రీకాకుళం పాత బస్టాండ్: వేసవిలో వేడిగాలులు పెరిగే సూచనలున్నాయని, ఈ పరిస్థితుల దృష్ట్యా ఆ విపత్తులను ఎదుర్కొనేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికను ఏర్పాటుచేయాలని జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు, చలివేంద్రాలు సిద్ధం చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. రానున్న వేసవిలో వడగాడ్పులు దృష్టిలో ఉంచుకుని విపత్తుల నిర్వహణపై అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. వడగాడ్పులు ఎక్కువగా రానున్నట్లు వాతావరణ అధికారులు తెలియజేస్తున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని, నీటి ఎద్దడి లేకుండా నీటి ట్యాంకర్లు సిద్ధం చేయాలని, ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

ఇద్దరు టీచర్లు సస్పెన్షన్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రచారం చేస్తున్నట్లుగా తగు ఆధారాలు లభించడంతో సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పలాస మండలంకు చెందిన మాధవరావు,సారవకోట మండలంకు చెందిన లక్ష్మీనారాయణపై వచ్చిన అభియోగాల మేరకు విచారణ చేసి ఈ నిర్ణయం తీసుకున్నారు.

కింజరాపు కోటపై తిరుగుబాటు బావుటా







- బాబాయ్, అబ్బాయ్ రాజకీయాలతో టీడీపీ కుదేలు
- డబ్బులు తీసుకుని టికెట్లు ఇప్పించారంటున్న స్వపక్ష నాయకులు
- అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు లక్ష్యంగా తిరుగుబాటు బావుటా
- రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లిస్తారని హెచ్చరికలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

'**అచ్చెన్నకు మాపై ఎందుకంత కక్ష**'.. అంటూ మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ వందలాది ముందు ఆవేదన వ్యక్తం చేశారు. 'అచ్చెన్న, కూన రవికుమార్ కుట్ర వల్లే నాకు టికెట్ రాలేదు. ఎంపీకైనా ఇక్కడి ఓట్లు అక్కర్లేదా..' అంటూ పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కార్యకర్తల ముందు బాధనంతా వెళ్లగక్కారు. బాబాయ్, అబ్బాయ్‌ల ఆధిపత్య ధోరణిపై జిల్లా టీడీపీ సీనియర్ నాయకులంతా అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. టికెట్ల ప్రకటన తర్వాత ఇది మరింత ఎక్కువైంది. పార్టీలో ఏం జరిగినా తమ కనుసన్నల్లోనే జరగాలనే ధోరణిలో వ్యవహరిస్తున్న కింజరాపు కుటుంబంపై స్వపక్ష నాయకులంతా గుర్రుగా ఉన్నారు.

శ్రీకాకుళంలో కావాలనే..

శ్రీకాకుళం నియోజకవర్గంలో గుండ ఫ్యామిలీని తొక్కాలని కింజరాపు ఫ్యామిలీ మొదటి నుంచీ ప్రయత్నిస్తోంది. ఇప్పుడది మరింత ఎక్కువైంది. తమ చెప్పు చేతుల్లో ఉండే నాయకుడు తప్ప తమను ప్రశ్నించే నాయకుడు ఉండకూదని గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులను సమయం వచ్చినప్పుడల్లా టార్గెట్ చేస్తున్నారు. వ్యూహాత్మకంగానే గొండు శంకర్‌ను రంగంలోకి దించి ఉసిగొల్పారు. గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించారు. చెప్పాలంటే గుండ ఫ్యామిలీపై గొండు శంకర్‌ను ఎక్కు పెట్టారు. బాగా డబ్బులు ఖర్చు పెట్టగల శంకర్‌తో నానా హడావుడి చేయించారు. గొండు శంకర్‌కే తప్ప గుండ ఫ్యామిలీకి ఏమీ లేదన్నట్టుగా అధిష్టానం దృష్టికి వెళ్లేలా చేశారు. చివరికొచ్చేసరికి టికెట్ విషయంలో పైరవీలు చేశారు. ప్రస్తుతం టీడీపీ అంతా డబ్బు మయమైపోయింది. ఎవరెక్కువ ఇస్తే వాళ్లకే టిక్కెట్ అంటూ లాబీయింగ్‌కు పెద్ద పీట వేసింది. ఈ క్రమంలో ఒక వైపు డబ్బు, మరోవైపు కింజరాపు ఫ్యామిలీ ఒత్తిడి వెరసి గుండ ఫ్యామిలీకి టిక్కెట్ దక్కకుండా చేసింది. ఇదంతా బహిరంగ రహస్యమే. డబ్బుతోనే టిక్కెట్ సాధించుకున్నావని, మీకు అది చేతకాలేదని గొండు శంకర్ అందరి దగ్గర అంటున్నారని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబుకు రూ.10కోట్లు, లోకేష్‌కు రూ.10కోట్లు, అచ్చెన్నాయుడికి ఇన్ని కోట్లు, రామ్మోహన్‌నాయుడికి ఇన్ని కోట్లు, కూన రవికుమార్‌కు ఇన్ని కోట్లు ఇచ్చానని టిక్కెట్ సాధించిన వ్యక్తే చెబుతున్నాడని మీడియా ముందు టీడీపీ నాయకులు ఆరోపించ డం గమనార్హం. దీన్ని బట్టి టిక్కెట్ల కేటాయింపులో డబ్బుకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో అర్థమవుతోంది.

ఎన్నికల్లో మూల్యం తప్పదు

కింజరాపు ఫ్యామిలీ కుట్రలకు బలైన నాయకులంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమను టార్గెట్ చేసి రాజకీయంగా తొక్కేసిన అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుకు బుద్ధి చెప్పాలని చూస్తున్నారు. ముఖ్యంగా ఎంపీ రామ్మోహన్‌ను ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. తమను ఇబ్బంది పెట్టిన వారికి బుద్ధి చెప్పాల్సిందేనని, రేపు ఎలా ఓట్లు పడతాయో చూస్తామంటూ హెచ్చరికలు కూడా చేస్తున్నారు. వారి స్వార్థ రాజకీయాలకు మమ్మల్ని బలి పశువు చేస్తారా? అని ఆగ్రహంతో రగిలిపోయి ఉన్నారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు అంటేనే ఒంటి కాలితో లేస్తున్నారు. మమ్మల్ని దెబ్బకొట్టినోళ్లకు తమ దెబ్బ ఏంటో చూపిస్తామంటున్నారు.

పొలిటికల్ స్పాట్ లైట్

డబ్బుకు రుచి మరిగారు..

పాతపట్నంలోనూ దాదాపు అదే పరిస్థితి చోటు చేసుకుంది. అక్కడ కూడా మామిడి గోవిందరావు ఆఫర్‌కు తలొగ్గి తనకు అచ్చెన్నాయుడు దెబ్బ కొట్టారని బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. కింజరాపు ఫ్యామిలీని నమ్ముకుని టిక్కెట్ కోసం ప్రయత్నించగా, సైలెంట్‌గా కింజరాపు ఫ్యామిలీ దెబ్బ కొట్టిందని కలమట వెంకటరమణ ఆవేదన చెందుతున్నారు. అంతా వారే చేశారని ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. పార్టీ పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయిందని, ప్లాట్ల పేరిట డబ్బులు తీసుకుని మోసం చేసిన మామిడి గోవిందరావును అభ్యర్థిగా పెట్టారంటే పార్టీ ఏ స్థాయికి దిగజారిపోయిందో అర్థమైపోయిందని, నాయకులు ఏ విధంగా అమ్ముడు పోయారనేది స్పష్టమవుతుందని టీడీపీని నమ్ముకుని మొదటి నుంచి రాజకీయాలు చేస్తున్న నాయకులు ఓపెన్ అవుతున్నారు. మామిడి గోవిందరావు ఇచ్చిన డబ్బులకు రుచిమరిగి నియోజకవర్గాన్ని తాకట్టు పెట్టేశారని భంగ పడిన నాయకులంతా ఆరోపిస్తున్నారు. సీనియర్ ఉంటే ఎదురు తిరుగుతారని, జూనియర్‌ను పెట్టుకుంటే చెప్పినట్టు నడుచుకుంటారని, తమ మాట జవదాటరనే ఉద్దేశంతో కలమటకు వ్యూహాత్మకంగా దెబ్బకొట్టారని చెబుతున్నారు.

కళా.. చివరికిలా..

జిల్లాలో మరో సీనియర్ నేత కళా వెంకటరావు కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. తమకు సమాంతరంగా రాజకీయాలు చేస్తున్నారన్న కారణంతో ఎక్కడ తొక్కాలో అక్కడ తొక్కే ప్రయత్నం చేశారు. అదును చూసి ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా బీజేపీకి కట్టబెట్టేలా పావులు కదిపారు. ఎచ్చెర్లకు ప్రాతినిధ్యం వహిస్తే తమకు అడ్డు తగులు తారని, ఈ జిల్లాలోనే లేకుండా చేస్తే పనైపోతుందని భావించి కళా వెంకటరావుకు పొత్తు సెగ పెట్టారు. కుడితిలో పడ్డ ఎలుకలా ప్రస్తుతం కళా గిలగిల కొట్టుకుంటున్నారు. కింజరాపు ఫ్యామిలీ కుట్రలను ఛేదించలేక చతికిలపడ్డారు. చివరికి చీపురుపల్లి అసెంబ్లీ స్థానం కేటాయించి పార్టీ చేతులు దులుపుకుంది.

విష ప్రచారానికి విరుగుడు యువ మంత్రమే

- యువతకు మంత్రి ధర్మాన దిశానిర్దేశం


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్వాతంత్ర్యం అనంతరం ఎవరూ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ విశాల భావజాలంతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రాజకీయాలంటే డబ్బు సంపాదించడం మాత్ర మే అన్న ఆలోచనను కల్పించింది చంద్రబాబు అయితే.. అందుకు భిన్నంగా రాజకీయాలను ప్రజల జీవితాలను మార్చడానికి ఉపయోగించింది వైఎస్ జగన్ అని అన్నారు. యువకులంతా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి నాయకత్వం నచ్చి పార్టీలోకి చేరడం అదృష్టంగా భావించాలన్నారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్ ఆధ్వర్యంలో యువజన విభాగంతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు మంత్రి ధర్మాన దిశానిర్దేశం చేశారు. జగనన్న గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో రౌడీయిజం, గూండాయిజాన్ని ప్రేరేపించే వ్యక్తులకు టీడీపీ టిక్కెట్ ఇచ్చిందని అన్నారు. ఇటీవలే ఓ సర్వే చేయిస్తే వెయ్యిమంది మహిళల్లో ఏడు వందల మంది వైఎస్సార్‌సీపీకే అనుకూలంగా ఉన్నట్లు తేలిందన్నారు. టీడీపీ ఎన్టీఆర్ పెట్టిన పార్టీ అని ఎంతోమంది అమాయకులు నమ్ముతున్నారని, సొంత మామనే వెన్నుపోటు పొడిచి చంద్రబాబు పార్టీని లాక్కున్నాడని అందరి కీ తెలిసేలా యువత చెప్పాలన్నారు. ఈనాడు రామోజీ, ఏబీఎన్ రాధాకృష్ణలు అబద్ధాలను పదిసార్లు చూపించి నిజం చేయాలని చూస్తున్నారని, వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. జిల్లాలో మూలపేట పోర్టు, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి పనులపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వచ్చే రెండు నెలలు వృద్ధులు, వితంతువులు పెన్షన్ తీసుకోడానికి సచివాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో జనాలకు చెప్పాలన్నారు. సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, డీపీ దేవ్, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, రొతు శంకరరావు, శిమ్మ రాజశేఖర్, సాధు వైకుంఠరావు, పాలకొండ అప్పారావు, మండవల్లి రవి, నక్క రామరాజు, గుండ హరీష్, బరాటం సంతోష్, తాతబాబు, కర్నేన హరి తదితరులు పాల్గొన్నారు. యువజన విభాగంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారికి పార్టీ కండువాలు వేసి శుభాకాంక్షలు చెప్పారు.



శ్రీకాకుళంలో యువతతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

వైఎస్సార్‌సీపీలో వంద కుటుంబాల చేరిక

జలుమూరు: శ్రీముఖలింగంలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. శనివారం సాయంత్రం ఆలయ చైర్మన్ బీవీ రమణ, ఎంపీటీసీ కె.హరిప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ బసవ యోగీశ్వరరావుతో పాటు దాదాపు వంద కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ సర్పంచ్, పీఏసీఎస్ అధ్యక్షుడు బసవ యోగీశ్వరరావు తోపాటు సీపాన లక్ష్మణరావు, సతివాడ విజయ, సత్యవతి, యడ్ల చెంచు, సతివాడ రాజేంద్ర, జగదీష్‌దాసు, పి.దాలిరాజు, పైల విశ్వనాథం, సన్యాసిరావు, జగ్గారావు,సుభాస్ పాడీ, తమ్మినేని దాలన్న దాండా మోహనరావు, మరువాడ వెంకటరమణ, దైలి రమణ, గెడ్డ వలస అప్పయ్య, పి.అప్పన్న, డి.రాజు, వై.సింహాచలం, పూజారి వెంకన్న, పైడి మురళీ, ప్రహ్లాద్ దాస్, బి.దివాకర్, శరత్ పాడి, రాజు పాడి తోపాటు సుమారు 100 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీసీ జోన్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణ చైతన్య, ధర్మాన రామలింగం నాయుడు, ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, స్థానిక నాయలు కె.హరిప్రసాద్, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, ఎం.రాజప్పలనాయుడు తోపాటు పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



శ్రీముఖలింగం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ



రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా ఎస్ఎంయూపీఎఫ్ పట్టణ దైవజనులు, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, సీనియర్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ సహకారంతో నగరంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. వెయ్యి మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ర్యాలీ మహిళా కళాశాల రోడ్డులో ఉన్న క్రైస్తవ ఆరాధనా కేంద్రం నుంచి చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి వరకు సాగింది.

–శ్రీకాకుళం కల్చరల్

మానవత్వం చాటిన ఎండీయూ ఆపరేటర్

కొత్తూరు: కుంటిభద్ర గ్రామం వద్ద ఓ వ్యక్తికి రహదారి ప్రమాదంలో శనివారం కాలు విరిగింది. అతడిని ఓ ఎండీయూ ఆపరేటర్ ఆస్పత్రికి తీసుకెళ్లి మానవత్వం చాటుకున్నారు. అగతముడి రామారావు అనే వ్యక్తి శనివారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు 108కు సమాచారం అందించగా.. అప్పటికే ఆ వాహనం మరో పేషెంట్‌ను తీసుకెళ్లడానికి బయల్దేరింది. దీంతో కుంటిభద్ర కాలనీకి చెందిన ఎండీయూ వాహనం ఆపరేటర్ దుంపల వాసు తన ఎండీయూ వాహనంపై క్షతగాత్రుడిని కొత్తూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో అందరూ ఆయనను అభినందించారు.

దళితులంటే చంద్రబాబుకి ఎందుకంత చిన్నచూపు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వృత్తి రీత్యా డ్రైవర్‌గా ఉన్న వ్యక్తి, దళిత కులానికి చెందిన వీరాంజనేయులుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే చంద్రబాబు ఆయనను అవహేళన చేసి మాట్లాడటం సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మానవతా దృక్పథంతో అట్టడుగు వర్గాల వారికి రాజ్యాధికారం అందించాలనే ఉద్దేశంతో వీరాంజనేయులకు వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు కులహంకారాన్ని చూపి విలువ తగ్గించి మాట్లాడితే దళిత జాతి బాబుని క్షమించదని పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాగే మనిషిగా పుట్టాలనుకునేవాడెవ్వడైనా దళితుడి గా పుడతారా అని అవమానిస్తూ మాట్లాడిన తీరును దళితులు మరిచిపోలేదన్నారు. 2024 ఎన్నికల్లో దళితులంతా ఏకమై నీ సైకిల్‌ను తునాతునకలు చేసి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టీడీపీకి దళితుల ఓట్లు కావాలే తప్ప వారి అభివృద్ధి అవసరం లేదన్నారు. యావత్తు దళిత జాతి అంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామన్నారు.

• జోరుగా.. హుషారుగా



ఆమదాలవలస రూరల్: కొర్లకోటలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారం



ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులోప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ



పాతపట్నం: పాతపట్నం కొత్త దేవాంగులవీధిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రచారం

ఎన్నికల ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. నాయకులు పల్లెపల్లెనూ పలకరిస్తూ ప్రజలతో కలిసిపోతున్నారు. కార్యకర్తలతో కలిసి ఊరుఊరంతా చుట్టేస్తున్నారు.

మాజీ మావోయిస్టు అప్పన్నకు విప్లవ నివాళి



మాజీ మావోయిస్టు గుంటు అప్పన్న(ఫైల్)

మందస: మందస మండలంలోని భేతాళపురం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్ట్ గుంటు అప్పన్న(80) శనివారం మరణించారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. 1969లో శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటం నుంచి 1992 మలిదశ పీపుల్స్‌వార్ ఉద్య మం వరకు అప్పన్న పోరాటంలో పాల్గొన్నారు. నిర్బంధంలో సుమారు 26 పోలీసు కేసులు కూడా ఆయనపై నమోదయ్యాయి. ఏడాదిపాటు జైలు జీవితం కూడా అనుభవించారు. విప్లవ లాంఛనాలతో అప్పన్న అంత్యక్రియలు నిర్వహించారు. కా ర్యక్రమంలో అమరవీరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షుడు తామాడ త్రిలోచన, సీఎస్‌సీ అధ్యక్షుడు పత్తిరి దానేసు, పీడీఎం అధ్యక్షుడు సాలీన వీరాస్వామి, ప్రజా నాట్య కళామండలి అధ్యక్షుడు కె.నీలకంఠం, పీకేఎస్ అధ్యక్షుడు దుర్యోధన, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనవర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దున్న హరికృష్ణ, మాజీ మావోయిస్ట్ మార్పు కృష్ణ, న్యూడెమొక్రసీ సభ్యుడు పి.భీమారావు, మాజీ సర్పంచ్‌లు బి.సాంబమూర్తి, కె.వాసు తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక న్యాయం వైఎస్ జగన్‌తోనే సాధ్యం'



అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీలను అన్ని విధాలుగా ఆదుకున్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని, ఆయనతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బీసీలకు 48 అసెంబ్లీ సీట్లు, 11 పార్లమెంటరీ స్థానాలు ఇచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాల్సిన సీట్లను కేటాయిస్తూనే బీసీలకు, మైనార్టీలకు కూడా సమన్యాయం చేసిన గొప్ప ఆదర్శవాది సీ ఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో బీసీలను బ్యాక్‌వర్డ్ క్యాస్ట్‌గానే చూశారని వైఎస్ జగన్‌మోహనరెడ్డి వారిని బ్యాక్‌బోన్ గా గుర్తించి సమన్యాయం చేశారని అన్నారు. పొత్తులో భాగంగా టీడీపీకి 144 సీట్లు వస్తే బీసీలకు 34 అసెంబ్లీ కేటాయించారని, ఇదేనా బీసీలకు న్యాయం చేయడం అని ప్రశ్నించారు. బీసీ కార్డుతో ఆవిర్భవించిన తెలుగు దేశం పార్టీలో చంద్రబాబు బీసీలకు పూర్తి గా అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ఏపీలో 2009–2014 మధ్యలో 17 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి వైఎస్ జగన్ వెంట నడిస్తే వారందరికీ న్యాయం చేశారని, 2014లో వైఎస్సార్ సీపీలో గెలిచి టీడీపీ లోకి చేరిన 23 మంది ఎమ్మెల్యేల్లో ఎంతమందికి చంద్రబాబు న్యాయం చేశారని సూరిబాబు ప్రశ్నించారు.

'బగ్గు' ఆస్పత్రిలో అరుదైన మోకాలి మార్పిడి చికిత్సలు



మోకాలి శస్త్ర చికిత్సలు చేస్తున్న దృశ్యం

అరసవల్లి: నగరంలోని బగ్గు సరోజిని ఆస్పత్రిలో శనివారం మోకాలి మార్పిడి చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, న్యూరాలజిస్ట్ డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు తెలియజేసిన వివరాల మేరకు.. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సుగ్గు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పర్యవేక్షణలో ఈ మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయని తెలియజేశారు. నగరంలో తొలిసారిగా ప్రపంచస్థాయి సాంకేతికతతో ఈ సర్జరీలు జరిగాయని తెలిపారు. ఈ చికిత్సల అనంతరం రోగులు మూడు రోజుల తర్వాత నడవగలిగి 30రోజుల తర్వాత దీర్ఘకాలిక పరిష్కారం పొందుతారని డాక్టర్లు తెలిపారు.

ఇంటిలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మెళియాపుట్టి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాపర గ్రామంలోని శివాలయం ఎదురుగా రోడ్ పాయింట్‌లో ఉంటున్న గోకర్ల వజ్రమ్మ ఇంటిలో సుమారు నాలుగు తులాల బంగారు చైను, బ్రాస్లెట్, నాలుగు ఉంగరాలు చోరీకి గురైనట్లు బాధితురాలి మనువరాలు రెడ్డి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. సీఐ నల్లి సాయి, క్లూస్‌టీమ్‌తో కలిసి శనివారం చోరీకి గురైన ఇంటిని పరిశీలించారు.

7న జిల్లాస్థాయి క్రికెట్ అంపైర్లు, స్కోరర్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో నిర్వహించనున్న పలు క్రికెట్ టోర్నమెంట్లకు అవసరమయ్యే జిల్లాస్థాయి అంపైర్లు, స్కోరర్ల కోసం ఏప్రిల్ 7వ తేదీన(ఆదివారం) ఎంపిక ప్రకియను నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవైఎస్ శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణత, 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుషులు/మహిళలు అర్హులని పేర్కొన్నా రు. క్రికెట్‌పై అవగాహన, పరిజ్ఞానం కలిగినవారు ఈ ఎంపికలకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైనవారికి ముున్ముందు రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ల కోసం నిర్వహించే క్వాలిఫైయింగ్ టెస్టులకు కూడా పంపిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఏప్రిల్ 7వ తేదీన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉన్న జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయం వద్దకు ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు కెఎస్ఎం శైలానీ (సెల్: 92466 31797)ని సంప్రదించాలన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

టెక్కలిరూరల్: టెక్కలి మండలం నౌపడ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉండవచ్చునని అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పలాస జీఆర్‌పీ ఆస్పత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిస్తే తమకు తెలియపరచాలని జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

ఉత్సాహంగా జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్, అండర్–23 పురుషుల క్రికెట్ జట్ల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రికెట్ నెట్స్‌లో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికల్లో క్రీడాకారులు ప్రదర్శించిన ప్రతిభను సెలెక్టర్లు పరిశీలించారు. రాణించిన క్రీడాకారులతోపాటు గత ట్రాక్ రికార్డులు కలిగిన సీనియర్ క్రికెటర్ల పేర్లను పరిగణనలోకి తీసుకున్నారు. వీరందరినీ జిల్లా సీనియర్స్, అండర్–23 ప్రాబబుల్స్ జట్లకు ఎంపికచేశారు. ఎంపికైన క్రీడాకారులకు త్వరలో శిక్షణ శిబిరాలతోపాటు సెలెక్షన్ మ్యాచ్‌లను నిర్వహించిన వారి రాణింపు ఆధారంగా తుది జట్ల ను ప్రకటిస్తామని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవైఎస్ శాస్త్రి, హసన్‌రాజా తెలిపారు. జిల్లా క్రికెట్ సంఘం మెంటార్ ఇలియాస్ మహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలకు చీఫ్ సెలెక్టర్లుగా రవిశంకర్ చలం సెలెక్టర్లుగా ఎంఎస్ దీపక్‌కుమార్, మేఘనాథ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి కెఎస్ఎం శైలానీ, డాక్టర్ సువ్వారి రవికుమార్, అసిస్టెంట్ కోచ్ అన్నెపు ఆనంద్‌కుమార్, సీనియర్ క్రికెటర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాశీబుగ్గ: పలాస మండలం రంగోయి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి వైద్యం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.